క్లుప్తంగా

అందుబాటులో విత్తనాలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో రైతులకు అవసరమగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సింగిల్ విండో సీఈఓ భాస్కర్‌గౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 25 కేజీల బస్తా వరి (బీపీటీ) రూ. 887, వరి (ఆర్‌ఎన్‌ఆర్)కు రూ. 912.50, వరి(ఎంటీయూ 1010, 118)కు రూ. 882, మొక్కజొన్న 5 కేజీల బస్తా రూ.600, వేరుశనగ కే6 30 కేజీల బస్తా రూ.2,865, మినుములు 4 కేజీల బస్తా రూ. 424, కందులు 4 కేజీల బస్తా రూ. 452, పెసరలు 4 కేజీల బస్తా రూ. 432 ఉన్నాయని కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకంలో వ్యవసాయ అధికారులతో ధృవీకరణతో హాజరుకావాలని ఆయన సూచించారు.

ఎర్రగట్టు మైసమ్మ ఆలయంలో పూజలు



మదనాపురం: మండలంలోని ఎర్రగట్టు మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి పాడి పంటలు, పిల్లలను సల్లంగా చూడాలని ప్రార్థించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి వసతి, విడిది సత్రాలను ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేశారు.

27న ఈఎన్‌సీ కార్యాలయం ముట్టడి



అమరచింత: హైదరాబాద్‌లోని ఈఎన్‌సీ కార్యాలయం ముట్టడికి మిషన్ భగీరథ కార్మికులు ఈనెల 27న తరలిరావాలని ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని మార్క్స్ భవనంలో ఆదివారం జేఏసీ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ కార్మికుల సమస్యలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య వక్తలుగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మసన్న పాల్గొని మిషన్ భగీరథ కాంట్రాక్టు తీసుకున్న కంపెనీ కార్మికుల జీవితాలతో ఆడుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రసాద్, రాజు, రఘు, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు



వనపర్తి టౌన్: రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడిన వారవుతారని మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. ఇప్పటి వరకు 82 సార్లు రక్తదానం చేసిన సామాజిక కార్యకర్త పోచ రవీందర్‌రెడ్డిని ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి, అవసరమైనప్పుడు రక్తదానం చేసే రవీందర్‌రెడ్డి సేవలను గుర్తించి గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందజేశారన్నారు

పౌల్ట్రీఫాం మూసేయాలని ఆందోళన



పెబ్బేరు: మండలంలోని కంచిరావుపల్లి శివారులో ఉన్న పౌల్ట్రీఫామ్ నుంచి వస్తున్న దుర్వాసనపై ఆదివారం గ్రామస్తులు రోడ్డుపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ శివారులో ఉన్న పౌల్ట్రీ ఫామ్ నుంచి దుర్వాసన రావడంతో గ్రామానికి చెందిన ప్రజలు, పిల్లలకు, వృద్ధులకు శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయన్నారు. దీంతో పాటు వర్షాలు పడుతున్న నేపథ్యంలో పలు రోగాలు వచ్చే అవకాశం ఉందని వాపోయారు. పౌల్ట్రీ సమీపంలోని వ్యవసాయ భూమిలో రైతులు, కూలీలు పనులు చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గతంలో ఈ సమస్యపై మంత్రి నిరంజన్‌రెడ్డికి, ప్రజావాణిలో కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్‌కు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదని మండిపడ్డారు. దీంతో గ్రామస్తులు జిల్లా కేంద్రానికి వెళ్లే రోడుపై బైఠాయించి ధర్నాకు దిగారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని గ్రామస్తులతో సమస్యలు తెలుసుకోవడంతో పాటు పౌల్ట్రీఫామ్‌కు సంబంధించిన మేనేజర్లను పిలిపించి మాట్లాడుదామని చెప్పడంతో ధర్నా విరమించారు.

సరళాసాగర్ కాల్వ పూడ్చివేత

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు శివారులో 30 ఎకరాలకు సాగునీరు అందించే సరళాసాగర్ 17 కాల్వను పూడ్చివేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన నాగిరెడ్డి అనే రైతు తన పొలం గుండా దిగువ పొలాలు అయిన సర్వే నంబర్లు 44, 45, 46లో ముప్పై ఎకరాలకు సాగునీరు అందించే కాల్వను రాత్రి వేళల్లో గుట్టు చప్పుడు కాకుండా ఇతర ప్రాంతం నుంచి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తీసుకొచ్చి కాల్వలో పోసి పూడ్చివేశారు. దీంతో కింది పొలాలకు వెళ్లే నీరు నిలిచిపోయింది. 60 ఏళ్లుగా దిగువ పొలాలకు సాగునీరు అందించే కాల్వ పూడ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో నారు మడులు పోసుకునే సమయంలో కాల్వ మూయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోతున్నారు. తక్షణమే కాల్వను పునరుద్ధరించాలని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని రైతులు తెలిపారు.



మట్టితో పూడ్చిన సరళాసాగర్ కాల్వ

దౌర్జన్యంగా పూడ్చారు..



60 ఏళ్లుగా దిగువ పొలాలకు సాగు నీరు అందించే సరళాసాగర్ కాల్వను ఉద్దేశపూర్వకంగానే మట్టితో పూడ్చివేశారు. ఈ కాల్వ ద్వారా నా సంబంధించిన ఆరు ఎకరాలకు సాగునీరు అందుతుంది. దీంతో నారు మడులు పోసే సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ విషయమై అధికారులకు విన్నవించాం. మా ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తక్షణమే కాలువను పునరుద్ధరించాలి.

– జగదీశ్వర్‌రెడ్డి, అజ్జకొల్లు

నారుమడులు ఎలా పోసుకోవాలి..



నా చిన్నప్పటి నుంచి కాల్వ నమ్ముకుని ఆరు ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాం. ఈ కాల్వ ద్వారానే మాకు సాగునీరు అందుతుంది. గుట్టు చప్పుడు కాకుండా కాల్వ పూడ్చివేయడంతో నీళ్లు రావడం లేదు. అధికారులు తక్షణమే స్పందించాలి.

– గోవర్ధన్‌రెడ్డి, అజ్జకొల్లు

అధికారులకు విన్నవించినా..



ఈ కాల్వ ద్వారా ఏడు ఎకరాలు సాగు చేస్తున్నాను. ప్రస్తుతం కాల్వను పూడ్చివేయడంతో నారు మడులు పోసుకునేందుకు ఇబ్బంది ఉంది. ఈ విషయాన్ని అధికారులకు విన్నవించాం. అయినా పట్టించుకోవడం లేదు. అధికారుల పర్యవేక్షణ లోపంతో కొంత మంది ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు.

– శ్రీనివాస్‌యాదవ్, రైతు, అజ్జకొల్లు

క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తాం..

కాల్వలో మట్టి పోసి మూసివేసిన ఘటన జరిగిందని రైతులు తమ దృష్టికి వచ్చింది. దానికి సంబంధించి క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తాం. ఆయకట్టు రైతులకు సాగు నీరందించే కాల్వలో మట్టి వేసి పూడ్చిన వారిపై చర్యలు తీసుకుంటాం.

– సింగిరెడ్డి అనిల్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ

సైనిక్ స్కూల్‌కు విద్యార్థి ఎంపిక



హర్షవర్ధన్‌ను సన్మానిస్తున్న క్రీడాకారులు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని శంకర్ క్రికెట్ అకాడమీలో కోచింగ్ తీసుకుంటున్న హర్షవర్ధన్ ఆల్ ఇండియా స్థాయిలో మహారాష్ట్ర సైనిక స్కూల్‌కు ఎంపికయ్యాడు. పట్టణ కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్న కమలాకర్ కుమారుడు హర్షవర్ధన్ శంకర్ క్రికెట్ కోచింగ్ తీసుకుంటూ సైనిక స్కూల్‌కు ఎంపిక కావడంతో పీజేపీ క్యాంప్ క్రీడా మైదానంలో క్రీడాకారులు విద్యార్థిని శాలువలతో ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో రాములు, ఈశ్వర్, రాజశేఖర్, మనోహర్, అరుణ్, అంజనేయులు, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఖిల్లాఘనపురం: తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఏకు పదేపదే ఆటంకం కలిగించిన ఓ వ్యక్తి పై కేసు నమోదు చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. మండలంలోని మామిడిమాడకు చెందిన గోవర్ధన్‌రెడ్డి ఈ నెల 21న తహసీల్దార్ కార్యాలయం దగ్గరకి వచ్చి అక్కడ విధుల్లో ఉన్న వీఆర్‌ఏ స్వప్నను విధులు నిర్వహించకుండా ఇబ్బందులు కలిగించారు. తీవ్ర ఆవేదనకు గురైన స్వప్న చేసేది లేక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరిశీలించిన ఎస్‌ఐ శ్రీహరి ఆదివారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మేక మృతి

ఆత్మకూర్: మండలంలోని పిన్నంచర్ల ఆంజనేయ స్వామి ఆలయం ముందున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గ్రామానికి చెందిన రైతు గొల్ల బుచ్చన్న చెందిన మేకల మంద విద్యుదాఘాతానికి గురయ్యాయి. దీంతో ఒక మేక అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు గమనించి విద్యుత్ సరఫరాను నిలిపేసి మేకల మందను కాపాడారు. దీంతో తనకు రూ.20వేలు నష్టం వాటిల్లిందని రైతు ఆందోళన వ్యక్తం చేశాడు. విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కేంద్రం నిధులతోనే పంచాయతీల అభివృద్ధి

వనపర్తి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12వేల గ్రామ పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతోనే సాధ్యమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని చిట్యాలలో ఆయన నాయకులతో కలిసి పర్యటించారు. తొమ్మిదేళ్ల కాలంలో బీజేపీ చేసిన అభివృద్ధి, సాధించిన ప్రగతి వివరాలను కరపత్రాలతో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు వివరించారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మహాజన సంపర్క్ అభియాన్ పేరిట నిర్వహిస్తున్న ఇంటింటికీ బీజేపీలో భాగంగా చిట్యాలలోని 90 పోలింగ్ బూత్ కుటుంబ సభ్యులను కలిసి కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, వెంకటసాగర్, బూత్ కమిటీ అధ్యక్షుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి టౌన్: మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో నాయకులు తొమ్మిదేళ్ల కాలంలో ప్రధానిగా మోదీ చేసిన అభివృద్ధి గురించి కరపత్రాలతో జిల్లా కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్‌లో జరిగే బీజేపీ సంకల్ప బహిరంగ సభకు వనపర్తి నుంచి ప్రజలు, కార్యకర్తల కోసం ఏర్పాటు చేసిన బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు, పోతు శ్రీనివాసులు, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌సాగర్, యాదగిరి, రమేష్, వెంకటేష్, మంద వెంకటేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో జెండా ఊపి బస్సు ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

పాన్‌గల్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బీజేపీ నిర్వహిస్తున్న నవ సంకల్ప సభకు ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి పలు వాహనాల్లో కార్యకర్తలు తరలివెళ్లారు. బీజేపీ మహిళ మోర్చా రాష్ట్ర నాయకురాలు రోజారమణి, నియోజకవర్గ నాయకులు అన్వేష్, మండల అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సభకు వెళ్లారు.

'సేవా కార్యక్రమాలతో ముందుకెళ్తున్నాం'



ఆత్మకూర్: వాసవీ క్లబ్, వనితా క్లబ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, జోన్ గవర్నర్లు శ్రీనివాసులు, పులిమామిడి రమేష్ శెట్టి అన్నారు. ఆదివారం స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో రైతులకు విత్తనాలు, క్రిమిసంహారక మందులు, సైనికుల భార్యలకు సన్మానం, చీరల పంపిణీ, నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ నీలేష్, జోన్ చైర్మన్ కల్వ రఘు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు సూరంపల్లి నవీన్, కార్యదర్శి పవన్, కోశాధికారి రామ్మోహన్, ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు కల్వ రాజయ్య, నిర్వాహకులు వీణశ్రీ, అర్చన, సుమశ్రీ, పావణి, బాలకృష్ణ, రమేష్, రామకృష్ణ, సీఎస్‌శెట్టి, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు



కొత్తకోట: పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో 30మంది కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించినట్లు క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు బెల్టులు అందజేశారు. కరాటే మాస్టర్స్ జాఫర్, హరీష్‌యాదవ్, మంజునాథ్, కురుమూర్తి, పవన్‌తేజ్ ఉన్నారు.

కంకర పోశారు.. బీటీ మరిచారు

- అసంపూర్తిగా ఖిల్లాఘనపురం–వెల్కిచెర్ల ఆర్‌అండ్‌బి రోడ్డు పనులు
- రూ.5.40 కోట్లు మంజూరు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

ఖిల్లాఘనపురం: ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడిన రోడ్డు మరమ్మతుకు నోచుకోలేదు. మండల ప్రజలు ఏళ్ల తరబడి ఎదురు చూసినా నిరాశే మిగిలింది. ఎట్టకేలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రోడ్డు మరమ్మతుకు నిధులు మంజూరు చేయించారు. టెండర్ తీసుకున్న కాంట్రాక్టర్ వెల్కిచెర్ల రోడ్డు నుంచి పర్వతాపురం రోడ్డు వరకు పాడైన బీటీని తొలిగించి కంకర పోసి వదిలేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



ఖిల్లాఘనపురం మండలం సల్కెలాపురం–వెల్కిచెర్ల రోడ్డుకు పోసిన కంకర



కంకర వేసి వదిలేసిన మామిడిమాడ రోడ్డు..

9.50 కిలో మీటర్ల రోడ్డుకు టెండర్

మండల కేంద్రం నుంచి పర్వతాపురం, మామిడిమాడ, సల్కెలాపురం గ్రామాల మీదుగా వెల్కిచెర్ల వరకు మొత్తం 9.5 కిలోమీటర్ల రోడ్డు పనులకు గాను ప్రభుత్వం మొత్తం రూ.5.40 కోట్ల ఆర్‌అండ్‌బీ నిధులు మంజూరు చేసింది. ఈ మొత్తం టెండర్ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ నెల రోజుల క్రితం మెటల్ వేసి వదిలేశాడు. కంకర తేలి ఉండటంతో వాహనదారులు అదుపు తప్పి కింద పడడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిలిచిపోయిన రోడ్డు పనులను తిరిగి ప్రారంభించి త్వరగా పూర్తి చేసేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి చేస్తాం

ఖిల్లాఘనపురం నుంచి పలు గ్రామాల మీదుగా వెల్కిచెర్ల రోడ్డు పనులకు గాను ప్రభుత్వం నిధులు మంజూరు చేశారు. కొంత వరకు రోడ్డుకు మెటల్ వేశాం. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– రాకేష్, ఆర్‌అండ్‌బీ ఏఈ, ఖిల్లాఘనపురం సెక్షన్

దివ్యాంగుల హక్కుల సాధనకు పోరాటం



మాట్లాడుతున్న ప్రభుస్వామి

అమరచింత: రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుల సంక్షేమం కోసం దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభుస్వామి తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన దివ్యాంగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని వాపోయారు. దేశవ్యాప్తంగా 2011 జనాభా లెక్కల ప్రకారం 2.68 కోట్ల మంది దివ్యాంగులు ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. కానీ 2016 దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం గుర్తించిన 21 రకాల వైకల్యాల ప్రకారం దేశ జనాభాలో 10 నుంచి 15 శాతం మంది దివ్యాంగులు ఉంటారన్నారు. 2023 జూన్ నుంచి ప్రారంభం అవుతున్న ఎన్ఎఫ్‌హెచ్‌ఎస్ ఆరో సర్వేలో దివ్యాంగుల వివరాలు నమోదు చేయడానికి అవకాశం లేకుండా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఎంత వరకు సమంజసం అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ జులై 10 నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన వ్యక్తం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, రామాంజనేయులు, బ్రహ్మయ్య, అనిఫాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేయాలి



కొత్తకోటలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కొత్తకోట: ముదిరాజ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ ఆదివారం స్థానిక చౌరస్తాలో ముదిరాజ్‌లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కుల అహంకారం, అధికార మదంతో మాట్లాడితే సహించేది లేదని, కౌశిక్‌రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకొని వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజీ మహేష్, నాగరాజు, విష్ణు, మహేష్, పెద్ద రాములు, నర్సింహ తదితరులు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: ముద్దిరాజులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ముదిరాజుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరంగాపురం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ దిష్టిబొమ్మ ఊరేగింపు చేస్తూ అంబేడ్కర్ చౌరస్తాలో దహనం చేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

కొత్తకోట: ఇబ్బందుల్లో ఉన్న చిన్ననాటి స్నేహితుడికి ఆర్థికసాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. పట్టణ కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2001–02లో పదో తరగతి చదువుకున్న ప్రవీణ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని గుర్తించిన చిన్ననాటి స్నేహితులందరూ కలిసి రూ.8,500 పోగు చేశారు. ఆదివారం ప్రవీణ్ ఇంటికి వెళ్లి పరామర్శించి ఆర్థికసాయం అందజేయడంతో పాటు రానున్న రోజుల్లో అండగా ఉంటామని మనోధైర్యానిచ్చారు. కార్యక్రమంలో బాలు, రవి, భాస్కర్, వెంకటేష్, రవి, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి చెందిన ఆకుల శేఖర్(40) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఇతడు 1998–99 విద్యా సంవత్సరంలో మెదక్ జిల్లా దౌల్తాబాద్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివాడు. మిత్రుడి మరణవార్త తెలుసుకున్న పాఠశాల మిత్రులు, ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన మిత్రులు బెస్తగోపాల్, చంద్రశేఖర్, రవీందర్ ఆదివారం మిత్రుడి ఇంటికి చేరుకుని భార్య ప్రమీల, కూతురు క్రిషికా, కుమారుడు సాత్విక్‌ను పరామర్శించి రూ.50 వేలు అందజేశారు.



ఖిల్లాఘనపురంలో బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం చేస్తున్న స్నేహితులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1989–90 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ స్థాయిల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆనాటి మధుర స్మృతులను నెమరు వేసుకోవడంతో పాటు ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాలకు సహాయ సహకారాలు అందించాలని నిర్ణయించారు.

బీఎస్పీతోనే బహుజన రాజ్యాధికారం

వనపర్తి: నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో సోమవారం నుంచి మూడురోజుల పాటు నిర్వహించే రాజ్యాధికార యాత్రను విజయవంతం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్.చెన్నరాములు కోరారు. ఆదివారం ఆయన స్థానిక బీఎస్పీ కార్యాలయంలో నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ ఈ యాత్రలో పాల్గొని దశాబ్దాలుగా రాజ్యాధికారం అనుభవిస్తున్న కొన్ని వర్గాల వారు చేస్తున్న అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తారని తెలిపారు. యాత్ర పెద్దమందడి మండలంలో ప్రారంభమై ఈనెల 29న వనపర్తి పట్టణంలో బహిరంగ సభతో ముగియనున్నట్లు వెల్లడించారు.

ఖిల్లాఘనపురం: వనపర్తి నియోజక వర్గంలో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించే బహుజన రాజ్యాధికార యాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని బీఎస్పీ జిల్లా కార్యదర్శి మొల్గర తిర్మలేష్, మండల అధ్యక్షుడు గోపి ముదిరాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండు వద్ద యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి మిద్దె యాదగిరి, మన్నెం, ధనుష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న బీఎస్పీ నాయకులు

పోడు హక్కు పత్రాల పంపిణీని కొనసాగించాలి

కొల్లాపూర్: పోడు హక్కు పత్రాల పంపిణీని కొనసాగించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌నాయక్ కోరారు. ఆదివారం కొల్లాపూర్‌లో గిరిజన సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌నాయక్ మాట్లాడారు. పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులకు ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు హక్కు పత్రాలు పంపిణీ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారన్నారు. కారణాలు లేకుండానే హక్కుపత్రాల పంపిణీ వాయిదా పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. హక్కు పత్రాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది గిరిజనులు ఎదురుచూస్తున్నారని, వెంటనే పంపిణీ ప్రక్రియ చేపట్టాలని కోరారు. సంఘం మండల అధ్యక్షుడు గోవింద్‌నాయక్, భరత్, గణేష్, మత్య, అశోక్, నారాయణ, కురుమయ్య, చెన్నయ్య రాజునాయక్ తదితరులు ఉన్నారు.